వాడవాడలా భోగి మంటలు

పులివెందుల టౌన్ : సంక్రాంతి పండుగ పర్వదినం సందర్భంగా ఆదివారం భోగి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి వాడవాడలా భోగి మంటలు వేసి పూజలు నిర్వహించారు. ఇంటి ముంగిట రంగు, రంగుల ముగ్గులను వేశారు.

ఎర్రగుంట్ల : పట్టణం, గ్రామాలలో తెల్లవారి జాము నుంచే భోగి మంటలు వేశారు. ప్రతి ఇంటి ముందు ముగ్గులతో, గొబ్బెమ్మలతో అలంకరించారు.

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, నల్లింగాయపల్లె, చదిపిరాళ్ల, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి తదితర గ్రామాల్లో భోగి మంటలు వేశారు. నల్లలిగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) కాలనీలో డీఏవీ భారతి స్కూల్‌లో భోగి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాయిరమేష్, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణంలో భోగి మంటలు వేశారు.



ఎర్రగుంట్లలోని నడివూరులో భోగి మంటలు వేసుకుంటున్న ప్రజలు

జమ్మలమడుగు : పట్టణం, మండలంలోని గ్రామాలలో ప్రజలు పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. పట్టణంలో శ్రీవాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలను వేశారు.

సింహాద్రిపురం : మండలంలోని పలు గ్రామాలలో భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి తమ సొంత గ్రామాలకు వచ్చి సంక్రాంతి వేడుకలను జరుపుకుంటారు.

వల్లూరు : మండలంలోని అన్ని గ్రామాలలో భోగి పండుగ సందర్భంగా మహిళలు ఇంటి ముంగిట కల్లాపి చల్లి పోటీలు పడి ముగ్గులు వేశారు. రాత్రి భజన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

పెండ్లిమర్రి : మండల ప్రజలు తెల్లవారుజామునుంచే భోగి మంటలు వేసుకున్నారు. కొందరు భక్తులు వెయ్యినూతలకోన లక్ష్మీనరసింహస్వామి, వెల్లటూరు చెన్నకేశవస్వామి, కొండ గంగమ్మ ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు



భక్తప్రహ్లాద నాటకంలోని ఓ ఘట్టం

పులివెందుల టౌన్ : స్థానిక గరండాల్ రివర్ ఫ్రంట్(రాణితోపు)లో రెండవ రోజు ఆదివారం నిర్వహించిన సురభి నాటక ప్రదర్శనలో భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. చక్రాయపేట మండలం సురభి గ్రామంలో పుట్టిన ఈ సురభి నాటకాలు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు. 6 రోజుల పాటు నిర్వహించే సురభి నాటకాలను ప్రతి ఒక్కరు తిలకించాలన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం .హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు డెవిడ్, ఆ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోమడ చెరువుకు నీరు విడుదల



సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామంలో ఉన్న చెరువుకు నీరు విడుదల చేశారు. దీంతో నీటితో చెరువు జలకలలాడుతోంది. మండలంలోని రైతులకు సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి చెరువకు నీటిని విడుదల చేయించారు. సింహాద్రిపురం, తొండూరు మండలంలో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఘనంగా గోదాదేవి కల్యాణం



శాస్త్రోక్తంగా జరుగుతున్న గోదాదేవి కల్యాణం

పులివెందుల టౌన్ : స్థానిక భాకరాపురంలోని శ్రీకృష్ణాలయంలో ఆదివారం శ్రీరంగనాథ, గోదాదేవిల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో శ్రీరంగనాథస్వామి, గోదాదేవి మూలవిరాట్లకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా చంద్రశేఖర్



కొండాపురం : తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా చంద్రశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు శాంతియుతంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

పులివెందుల టౌన్ : పట్టణంలోని కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటరామిరెడ్డి గురుస్వామి తెలిపారు. మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మకరజ్యోతి దర్శనం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు పడిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి తరించాలన్నారు.

ఏపీ భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కమలాపురం : ప్రజల ఆస్తులకు భద్రత లేని ఏపీ భూ హక్కు చట్టాన్ని-27/2023ను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఆదేశాల ప్రకారం నిర్ణయాలు తీసుకునే రెవెన్యూ అధికారులు, ఇతర యంత్రాంగం ప్రజల ఆస్తులకు హక్కులను నిర్ణయిస్తారన్నారు. అలా నిర్ణయించిన హక్కులను టైటిల్ రిజిష్టర్‌లో నమోదు చేస్తారని, భూ హక్కుదారులకు ఇది శాశ్వతంగా హక్కు కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన శాశ్వత భూ హక్కు చట్టం 27/2023 హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారిని బహుమతులను ప్రధానం చేశారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రభాకర్ విల్లాస్ అధినేత ప్రభాకర్‌రెడ్డి సహకారంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి ఆకర్షనీయమైన బహుమతులను అందజేశారు. ఈపోటీలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. అలాగే నెహ్రూ యువకేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో లెమన్‌స్పూన్ పోటీలను నిర్వహించారు. ఇందులు మహిళలు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.